క్లుప్తంగా

గంధం సేవలు అభినందనీయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి టిన్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: గంధం వెంకటస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తోకలపూడి గ్రామానికి చెందిన గంధం లక్ష్మి సోమసుందరం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు తోకలపూడి సెంటర్లో సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్, బస్టాండ్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ కౌరు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి మరెక్కడా ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గంధం వెంకటస్వామి నాయుడు, గంధం నాగబాబు, గంధం సూరిబాబు, కేశుబాబు, హరిబాబు, శశి ప్రియ, లక్ష్మి సోమసుందరం, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరి ఓంకార్, గ్రామ సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు, వన్నెంరెడ్డి సుబ్రహ్మణ్యం, పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి, గొలగాని సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

తుది దశకు సచివాలయాల నిర్మాణాలు



అనాకోడేరులో సచివాలయ భవన నిర్మాణం పూర్తయిన దృశ్యం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరుసుమర్రు, గూట్లపాడు, అనాకోడేరు గ్రామాలలో సచివాలయాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాలలో సచివాలయాలు పూర్తి కాగా, వాటి ద్వారా ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అనాకోడేరు, దిరుసుమర్రు, గూట్లపాడు గ్రామాలలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయాలు తుది చేరుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శి, వీఆర్వో, మహిళా పోలీస్, వ్యవసాయ, ఫిషరీస్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్, మీటింగ్ హాలు కోసం సచివాలయాల్లో వేర్వేరు గదులను ఏర్పాటు చేశారు.

ఆక్యుపంక్చర్ వైద్యంతో ఉపయోగం



ఆక్యుపంక్చర్ వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆక్యు పంక్చర్ వైద్యంతో సయాటికా, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాల వ్యాధుల నుంచి ఉపసమనం పొందవచ్చని ప్రముఖ వైద్యుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక తెలగ కల్యాణ మడపంలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీఎస్ఆర్ ఫిజియోథెరపి వారి సహకారంతో ఆక్యుపంక్చర్, నేచురోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ చినిమిల్లి మాట్లాడుతూ ఆక్యుపంక్చర్ వైద్యం ప్రాచీనమైందని, చైనాలో ఎక్కువ ప్రాచూర్యం పొందిందని చెప్పారు. సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి పౌండేషన్ ప్రతినిధులు జయలక్ష్మి, సంకు భాస్కరనాయుడు, ఆరేటి వేణు, కోటిపల్లి కన్నబాబు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు సెంట్రల్: వాసవి ఇంటర్నేషనల్ సంస్థ దేశవ్యాప్తంగా పలు క్లబ్‌లు స్థాపించి కోట్లాది రూపాయలు విలువైన సేవా కార్యక్రమాలు అందిస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సూర్యప్రకాష్ తెలిపారు. ఆదివారం స్థానిక కంచర్ల పురుషోత్తం వాసవీ క్లబ్ కళ్యాణ మండపంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలనే సంకల్పంతో సరస్వతి పథకం ఏర్పాటుచేసి ఎక్కువ మంది విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పించడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా ఇమ్మిడి రాజేష్, సెక్రటరీ పలివెల శివ, ట్రెజరర్ చవ్వా సతీష్ కుమార్‌లచే జిల్లా గవర్నర్ కొల్లేపర కృష్టాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మూడు కుట్టు మెషీన్లు, ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు, సరస్వతి పథకానికి రూ. 25 వేలు విరాళం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, వాసవి క్లబ్ సభ్యులు బొండాడ భాస్కర్, గాదె జనార్ధన్ గుప్తా, శ్రీకాకొల్లు మైధిలి పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజల జీవనం మెరుగు

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- తోకలపూడిలో నూతన సచివాలయ భవనం ప్రారంభం



తోకలపూడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వీరవాసరం మండలం తోకలపూడి గ్రామంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో ప్రజలకు ప్రభుత్వపరంగా ఏ అవసరమొచ్చినా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల చుట్టూ తిరగాల్సివచ్చేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా గ్రామ సచివాలయాల ద్వారానే ప్రజలకు నిర్ణీత గడువులోగా పనులు జరిగేలా తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలని, ప్రభుత్వ సేవలను పొందడానికి ప్రజలు ఇబ్బందులు పడకుండా సచివాలయ సిబ్బంది పనిచేయడం జరుగుతుందని అన్నారు. అదే మాదిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని, ప్రతి ఇంటికీ కూడా నవరత్న పథకాలను అందిస్తూ వారి జీవన స్థితిగతులను మెరుగుపరుస్తున్నారని పేర్కొన్నారు. ఒక పక్క అభివృద్ధి, మరో వైపు సంక్షేమంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పూర్తిగా అండగా ఉన్నారని, ఇందులో ఎటువంటి సందేహం లేదన్నారు. గతంలో మహానేత వైఎస్సార్ ప్రజల కష్టాలను తెలుసుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. తిరిగి ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల కష్టాలను పాదయాత్ర ద్వారా నేరుగా తెలుసుకుని వాటిని శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుందర్రాజు, ఎంపీపీలు పేరిచర్ల విజయ నరసింహారాజు, వీరవల్లి దుర్గాభవాని, ఇంచార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూడూరి ఓంకార్, సర్పంచులు వీరవల్లి శ్రీనివాసరావు, చికిలే మంగతాయారు, నాయకులు పోలిశెట్టి దాసు, నాగరాజు శ్రీనివాసరాజు, గొలగాని సత్యనారాయణ, వేగేశ్న వర్మరాజు, వన్నెంరెడ్డి సుబ్రహ్మణ్యం, పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి, పెచ్చెట్టి వీరాంజనేయులు, సామా నాగరాజు, గంధం కేశుబాబు, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

అండర్ టన్నెల్ నిర్మించండి సారూ..

ఆకివీడు: రైల్వే డబ్లింగ్ నిర్మాణం అనంతరం ఆకివీడు ప్రాంతంలో అండర్ టన్నెల్ నిర్మించకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దుంపగడప వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దుంపగడప గ్రామం వద్ద ఉప్పుటేరుపై రైల్వే వంతెన వద్ద అండర్ టన్నెల్ నిర్మించాలని ఆదివారం ఆ ప్రాంతంలో నాయకులు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు పిన్నమరాజు సూర్యనారాయణరాజు, కొట్టు మాణిక్యాలరావు, కవిటం సుబ్రహ్మణ్యం, మద్దా సుధాకర్, కిరణ్ తదితరులు మాట్లాడుతూ ఆకివీడు ప్రాంతంలో నాలుగు రైల్వే గేటులు ఉన్నాయని, ప్రతి అరగంటకూ ఒక రైలు వెళుతోందని, దీంతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు సమయానికి స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లలేకపోతున్నారని వాపోయారు. ఉప్పుటేరుపై రైల్వే వంతెన ఆఖరు ఖానా ప్రాంతంలో ద్విచక్ర వాహనాలతో పాటు చిన్న కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు గతంలో నడిచేవని పేర్కొన్నారు. ఆప్రాంతంలో అండర్ టన్నెల్ నిర్మించాలని కోరుతున్నారు.

క్రైస్తవులంతా వైఎస్సార్ సీపీ వెన్నంటే



జాన్సన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కొర్రపాటి అనిత, వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ఎన్నికలు ఎప్పుడొచ్చినా క్రైస్తవులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడిగా నియమితులైన మేడిది జాన్సన్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, క్రైస్తవ నాయకులతో కలసి ఆమె ఆదివారం భీమవరంలో జాన్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉండిలో ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్రాల క్రైస్తవులకు అండగా, పెద్ద దిక్కుగా ఉంటున్న జాన్సన్‌ను క్రైస్తవులకు రాష్ట్రాధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. క్రైస్తవుల బలోపేతానికి వారి కోసం ప్రత్యేక పార్టీ సెల్‌ను ఏర్పాటు చేయడంతో క్రైస్తవులకు వైఎస్సార్ సీపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక గుర్తింపునిచ్చారన్నారు. దీంతో రాష్ట్ర క్రైస్తవులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గతంలో క్రైస్తవులకు ప్రత్యేక గుర్తింపు ఎవ్వరూ ఇవ్వలేదని, ఇప్పుడు ప్రత్యేకమైన శ్రద్ధతో క్రైస్తవులను గుర్తించిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రుణం తీర్చుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. జాన్సన్ మార్గనిర్దేశంలో వైఎస్సార్‌సీపీని మరింత బోలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిగురుపాటి క్రిస్టాఫర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొడ్డు నాగన్న, పౌలు, గాలి భూషణం, కృపారావు, ఈలి సాధు, కె.చిట్టిబాబు, ఎం.ఇస్సాకు, ఎం.మహాలక్ష్మడు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిద్దాం



ఉణుదుర్రులో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిద్దామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జీ సుందర్‌కుమార్ అన్నారు. ఆదివారం పింఛన్ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉణుదుర్రులో కొత్తగా పింఛను మంజూరైన పలువురు లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా సుందర్ కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూనపరాజు వర్మ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే పింఛన్ల ద్వారా ఎంతో మంది సంతోషంగా బతుకుతున్నారన్నారు. పింఛను తీసుకునే వృద్ధులు, అక్కాచెల్లెమ్మలు ముఖ్యమంత్రి తమ పెద్ద కొడుకు అంటూ ఆత్మీయంగా మాట్లాడుతున్నారన్నారు. ఏదైనా సంక్షేమ కార్యక్రమం చేస్తే దానికి పదింతలు ప్రచారం చేసుకునే రాజకీయ నాయకుల మాదిరి కాకుండా చెప్పింది చేస్తూ, చేస్తున్నదే చెబుతున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఆయన పార్టీలో నాయకులుగా ఉండి ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు కూనపరాజు వర్మ, సచివాలయ కన్వీనర్ రెడ్డి కనకదుర్గ, పైలా సత్యనారాయణ, గెడ్డం కాంతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో వెస్ట్ బెర్రీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఇటీవల హర్యానా రాష్ట్రంలో జరిగిన సీబీఎస్ఈ జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్‌కుమార్ చెప్పారు. ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు పాల్గొనగా వెస్ట్ బెర్రీ విద్యార్థులు 15 పతకాలు సాధించారన్నారు. ఎస్.హేమ హరిసుభాష్ ఒక బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకాన్ని, అలాగే డి.నందన్ కుమార్‌వర్మ ఒక రజతం, ఒక కాంస్య పతకం, ఎంఎల్‌వీ సాయి చరణ్, డి.రేవంత్ వర్మ రజతం గెలుచుకోగా, ఎం.పుష్పితల్లి, కె.ప్రజ్ఞ్య నియతి, ఎ.శ్రేష్టవర్మ, పి.శ్రీవైష్ణవి, కె.అమోఘ, డి.భవ్య, ఎస్.భార్గవి, డి.ఆద్య ఒక్కొక్క బంగారు పతకాన్ని సాధించారన్నారు. సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో కె.సుష్మిత మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని పొందిందన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ మహేష్ కుమార్, ప్రిన్సిపాల్ సత్యవోలు హేమావతి తదితరులు అభినందించారు.

గీతా ముఖర్జీకి ఘన నివాళి



గీతా ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: సమసమాజ స్థాపనే లక్ష్యంగా అలుపెరుగని పోరాటాలు సాగించిన కమ్యూనిస్టు యోధురాలు గీతా ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఆదివారం స్థానిక శ్రీనివాస్ థియేటర్ సెంటర్లో సీపీఐ స్తూపం వద్ద గీతా ముఖర్జీ శత జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ 15 ఏళ్ల చిన్న వయస్సులోనే సీపీఐలో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. బెంగాల్ శాసనసభకు సభ్యురాలుగా, అనేక పర్యాయాలు పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారన్నారు. సమస్యలపై తన గళాన్ని విప్పి పార్లమెంట్ నే గడగడలాడించి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఖ్యాతి గడించారన్నారు. సికిలే పుష్పకుమారి, సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, ఆకలి రాము పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీసద్గురు త్యాగరాజ స్వామి 104వ ఆరాధనోత్సవాల సందర్భంగా స్వామి వారితో సంగీత నాద స్వర వాయిద్యాలతో త్యాగరాజ కీర్తనలతో నగర సంకీర్తన, సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ, త్యాగరాజ స్వామి ఉత్సవ విగ్రహాలతో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. తొలుత త్యాగరాజ భవనంలో నిర్వాహకులు సంగీత కళాకారులతో సంప్రదాయ పూజలు నిర్వహించారు. త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి, ఉపాధ్యక్షులు కారుమూరి ఆదిత్య, గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ త్యాగరాజ స్వామి 104వ ఆరాధనోత్సవాలను ఘనంగా ప్రారంభిస్తూ స్వామివారి శోభా యాత్ర నిర్వహించామని, 5 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్ నుంచి విద్వాంసులు వస్తున్నారని అన్నారు. చెరుకువాడ సోదరులు వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ 1919లో ఈ ఉత్సవాలను గునుపూడి సర్వ ధర్మయ్య ప్రారంభించారని, అప్పటి నుంచి ఎందరో మహనీయులు సేవలందిస్తున్నారని, ఈ ఆరాధనోత్సవాలు మూడు రోజులు త్యాగరాజ భవనంలో, రెండు రోజులు అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు కనుమూరి సత్యనారాయణ రాజు, కారుమూరి ప్రకాష్, కారుమూరి బాబు, మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మదిలో జ్ఞాపకాలు ‘పది’లం



కాళ్ల హైస్కూల్లో సమావేశమైన 1990-91 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కాళ్ల: ‘స్నేహబంధము.. ఎంత మధురము.. కరిగిపోదు.. చెదిరిపోదు’ అంటూ ముప్పై ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. వివిధ వృత్తులు, ఉద్యోగ, వ్యాపారాల్లో వేర్వేరు చోట్ల స్థిరపడిన విద్యార్థులు స్నేహ బంధమే ముఖ్యమంటూ ఓ చోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడిపాడారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ కలిసి తీర్మానించారు. దీనిలో భాగంగా సుమారు రూ.85 వేల విలువైన మైక్ సెట్‌ను పాఠశాలకు బహూకరించారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు.

మత్స్యకారుల ఉపాధి కాపాడాలి

పెనుగొండ: ఇసుక ర్యాంపులతో మత్స్యకారుల ఉపాధి కోల్పోతున్నారని, సత్వరం మత్స్యకారుల ఉపాధిని కాపాడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరుతో మాట్లాడుతూ సుమారు 500 కుటుంబాలు సిద్ధాంతం, దొంగరావిపాలెంల్లో మత్స్యవేటపై ఆధారపడి జీవిస్తున్నారని, ర్యాంపుల నిర్మాణాల వల్ల మత్స్య సంపద తగ్గి అవస్థలకు గురవుతున్నారు, ప్రభుత్వం సత్వరం స్పందించాలని కోరారు. నాగిశెట్టి గంగారావు, కర్రి కనకరాజు, మోకా సూర్య చంద్రరావు, వాతాడి అర్జునరావు, కర్రి కొండయ్య, రాంబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాలినడకన మావుళ్లమ్మ దర్శనం

భీమవరం (ప్రకాశంచౌక్): హిందుమత ప్రచారంలో భాగంగా 220 మంది భక్తులు పాలకొల్లు నుంచి కాలినడకన వచ్చి శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారని మావుళ్లమ్మ అమ్మవారి ఆలయ దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు చెప్పారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త రామాయణం సత్యనారాయణ, ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ పాల్గొన్నారు.

వైభవంగా పల్లాలమ్మ జాతర



పల్లాలమ్మను దర్శించుకుంటున్న శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: ఆలమూరులో శ్రీపల్లాలమ్మ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించడంపై కమిటీ సభ్యులను అభినందించారు. జాతర సందర్భంగా దూరప్రాంతాల వచ్చిన బంధుమిత్రులతో ఆలమూరు గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం రాత్రి భారీ ఎత్తున వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి నలువైపులా పెద్ద ఎత్తున స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి గ్రామానికి విద్యుత్ దీపాలు, అమ్మవార్ల కటౌట్ల అలంకరణలతో జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుతో పాటు రాజమండ్రి రుడా ఛైర్ పర్సన్, వైఎస్సార్‌సీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర యోగా సంఘ అధ్యక్షుడు చెరుకువాడ నరేష్‌రాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, సర్పంచ్ మేడపురెడ్డి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, మాజీ సర్పంచ్ కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి జగనన్న సంక్రాంతి సంబరాలు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఈ నెల 11 నుంచి 13 వరకు జగనన్న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వన్నెకుల సంక్షేమ సంఘం డైరక్టర్ బందన పూర్ణచంద్రరావు తెలిపారు. ఆదివారం ముత్యాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11 నుంచి 13 వరకూ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు, 13 మధ్యాహ్నం గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు అందిస్తామని, ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు అందిస్తామన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లాటి రామారావు, రేవు రాంబాబు, దొంగ యుగంధర్, సాదనాల రామకృష్ణ, బర్రి సామోరు, కొపనాతి గంగాజలం నిర్వహణలో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రామాలయంలో ధనుర్మాస పూజలు



రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలో ధనుర్మాసపూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. స్వామి వారికి అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు 24వ పాశురవిన్నపాన్ని ఆలపించారు. ఆలయ నిర్వాహకులు శ్రీకాకొల్లు వెంకన్న, విన్నకోట రంగనాయకులు, అర్చకుడు ఆచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులంతా అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

నేత్రపర్వంగా రుక్మిణీ కల్యాణం

అత్తిలి: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం లక్షతులసి పూజ, రుక్మిణీ కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం, పంచామృత కలశారాధన, భగవద్గీత పారాయణం, గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీస్వామివారికి పంచామృతాభిషేకం, సప్తనదీ జలాభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం స్వామివారికి లక్ష తులసి పూజ, కుంకుమ పూజ, వివాహార్ధులతో కాత్యాయని వ్రతం, సంతాన వేణుగోపాల మూల మంత్ర హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రుక్మిణీ కల్యాణో మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసారు. లోక కల్యాణార్థ శ్రీస్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గర్నిపూడి సర్వేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి పి.సూర్యనారాయణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

పెనుగొండ: విద్యార్థి స్థాయి నుంచి వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం వల్ల ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని ఎస్వీకేపీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు అన్నారు. ఆదివారం పెనుగొండ విశ్వతేజలో నెహ్రూ యువకేంద్రం యువజన వ్యవహారాలు, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ, వారధి సోషల్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘నేడు యువతలోనాయకత్వ లక్షణాలు, సమాజ అభివృద్ధి’ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఎన్‌వైకే జిల్లా యువ అధికారి దూలం కిషోర్ పాల్గొని యువత వారిలో నాయకత్వ లక్షణాలు అవర్చుకొనే విధానం, సమాజంలో ఎలా ప్రవర్తించాలో వివరించారు. కళాశాల సెక్రటరీ ఎం నాగబాబు, వారధి సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కామాక్షీ రవి పాల్గొన్నారు.